# అమ్మ తపన

## నిడదవోలు మాలతి

పైకివెళ్ళే ఎలివేటర్ కోసం ఎదురు చూస్తున్నాను.

నాకంటె ముందొచ్చినతను నొక్కిన బటనే మళ్ళీ మరోసారి నొక్కి- గోడమీద ఉన్న అంకె వేపు చూశాడు.

మూడు.

మూడో అంతస్థులో ఎవరో ఎలివేటర్ పెట్టుక్కూచున్నారులా ఉంది. ఎంతకీ దిగి రావడంలేదు.

ఓ గళ్ళ చొక్కా కుర్రాడు గబగబా వచ్చి ఆ బటనే మళ్ళీ నొక్కి హడావుడిగా అటూ ఇటూ చూడడం మొదలు పెట్టాడు. వారం రోజుల్నుంచి చూస్తున్నాను. ఇంతా చేస్తే మూడో అంతస్థు కెళ్తాడు. అంత తొందరయితే మెట్లమీంచి వెళ్ళిపోకూడదూ? మళ్ళీ బటన్ నొక్కాడు.

నాకు నవ్వొచ్చింది ఈ ఎలివేటర్ మనస్తత్వం గురించి.

"ఈ యంత్రాంగంఅంతా మన కాలం వృధా కాకుండా ఉండడానికి" అన్నాడతను నావేపు చూసి తల విదిలిస్తూ.

"తాబేలు గెల్చిన కథ లిందుకే వచ్చేయి" అన్నాను.

దూరంగా కారిడార్లో జూలీ కనిపించింది గబగబా నడుస్తూ. అక్కడి నుంచే చెయ్యూపింది.

అప్రయత్నంగా ఎలివేటర్ ఇండికేటర్ వేపు చూశాను. ఇంకా మూడు దగ్గరే ఉంది!

"పోనీ మెట్లమీంచి పోతే...." గళ్ళ చొక్కా కుర్రాడు ఎవరితోనో తెలీకుండా అన్నాడు.

జూలీ దగ్గరకి వస్తోంది.

మెట్లు....

ఇండికేటర్ చూశాను. రథం కదిలింది. అన్యాయం!

రెండు.

ఒకటి.

జూలీ ఇంకా కొంచెం దూరంలో ఉంది- "హై" అంది దూరం నించే.

"హై" అనేసి ఎలివేటర్లోకి వెళ్ళి నించున్నాను.

గళ్ళచొక్కా కుర్రాడు తలుపు మూసే బటన్ టకటక నొక్కేడు.

సగం మూసుకుంటున్న తలుపులకి చెయ్యి అడ్డం పెట్టి జూలీ లోపలకొచ్చి "అమ్మయ్య" అంది.

"సాధించేవు" అన్నాను నవ్వి.

"బాగున్నావా?"- జూలీ నన్నడిగింది.

"బాగానే ఉన్నాను. నువ్వో?"

"బ్రహ్మాండం అనుకో" అంది.

"ఏం ఏదేనా విశేషమా?" అనడిగేను- యధాలాపంగానే.

"హుఁ" అంది కళ్ళెగరేసి.

నాకాశ్చర్యం వేసింది. జూలీ అంత తేలిగ్గా ఒక్క "హుఁ"తో ఎప్పుడూ జవాబు పోనివ్వలేదు.

తొమ్మిదో అంతస్తొచ్చింది.

ఇద్దరం ఎలివేటర్లోంచి బయటపడి మా స్థానాలవేపు నడిచేం.

సర్దుకుని సీట్లో కూచునేసరికి ఫోన్ మోగింది-జూలీకి. ఆర్నెల్ల నుంచి చూస్తున్నాను. రోజుకి పన్నెండు కాల్స్ వొస్తాయి. ప్రతి కాలూ ముప్పావుగంట పడుతుంది. ఫోన్ కాకపోతే ముఖాముఖి మాట్లాడడానికి ఎవరో ఒకరొస్తారు-టామ్, డిక్, హరీ-ఎవరో ఒకరు. ఇన్నిటి మధ్య ఆవిడకి నన్ను వేధించడానికి కావలసినంత టైముంటుంది.

"ఇందిరా గాంధీ high handedగా పాలిస్తోంది. నువ్వేం అనుకుంటున్నావు?"

"మీ దేశంలో జనాభా ఎక్కువ కదా?"

"దరిద్రం ఎక్కువ కదా?"

ఆఖరికి ఒకసారి చెప్పాను "రాజకీయాలు నా ఆరోగ్యానికి పడవు. పైగా నాకు చచ్చే పనుంది."

జూలీ సిగరెట్ తీసి నోట్లో పెట్టుకోబోతూ అడిగింది. "అభ్యంతరమా?"

నిస్సందేహంగా అభ్యంతరమే! నాకు సిగరెట్ వాసన పడదు.

"లేదు" అన్నాను ఆవిడ వేపు చూడకుండా.

"చూశావా? ఎవరో మహా ఇల్లాలు మొగుణ్ణి కోళ్ళు కోసే కత్తితో పొడిచేసిందిట. బతికున్నన్నాళ్ళూ నానా హింసా పెట్టాట్ట.... మీ దేశంలో మొగాళ్ళు ఆడవాళ్ళని కొడతారా? కొట్టినా, తిట్టినా ఆడవాళ్ళు కిక్కురుమనకుండా పడి ఉంటారుట కదా?"

ఆవిడ ప్రశ్నలతో, సందేహాలతో, తలా తోకాలేని అభిప్రాయాలతో నాకు తల తిరిగిపోతుంది.

ఆడవాళ్ళ అధ్వాన్నపు స్థితి.

దరిద్రం.

బానిసత్వం.

నిరంకుశత్వం.

"ఇవాళ ఉత్తరాలొచ్చాయా?"—మాట మార్చడాని కడుగుతాను. అదే ప్రశ్న ఇవాళా అడిగాను.

"నాకు తెలీదు"- అదీ అలవాటయిన జవాబే.

"చూసొస్తాను"- అంటూ లేవబోయాను. నిజానికి కొంచెంసేపుంటే నా బల్లదగ్గిరికే వస్తాయి.

"ఏం, అర్జెంటుగా రావలసినవేమయినా ఉన్నాయా?" జూలీ అడిగింది.

మళ్ళీ ఫోను. జూలీ ఫోను తీసింది.

ఓ ముప్పావు గంటదాకా ఫరవాలేదు.

ఉత్తరాల మాట మర్చిపోయి ఫైలు తీశాను. మనసు ఫైలుమీది కెళ్ళడం కష్టంగా ఉంది. ఎంత కూడదనుకున్నా జూలీ తత్త్వం చిరాకుపెడుతోంది.

మీ దేశం.... ఇందిరా గాంధీ.... ఆడజన్మ.... దిక్కులేని పిల్లలు.... కూడులేని బతుకులు.... ఏఁవిటో ఈ అమ్మాయి తాపత్రయం. ఆవిడకి మహా అయితే ముప్పై యేళ్ళుంటాయేమో.

క్షణం తీరికలేని జన్మ.

గుక్క తిప్పుకోని బతుకు.
ఎనలేని వ్యాపకాలు.
చేస్తున్న ఉద్యోగంమీద ధ్యాస లేదేం?
ధ్యాసలేని ఉద్యోగంలో చేరడమేం?
జూలీ ఫోన్‌పెట్టేసి కిటికీలోంచి చూస్తూ విసుగ్గా చెత్తబుట్టలోకి విసిరేశాను.

జూలీవేపు చూశాను. ఆతృతగా ఉత్తరాలు చదువుతోంది.

ఫైల్ తీసుకుని పీటర్‌తో మాట్లాడడానికి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి జూలీ కిటికీలోంచి ఎటో చూస్తోంది.

జూలీ ఆ మాట ఒప్పుకోదు.

"పీటర్ పెళ్ళాన్నొదిలేశాడు తెలుసా?" హేళనగా నవ్వుతుంది.

నా కలాటి సరసాలు నచ్చవు.

"చూడు. నా కతని వ్యక్తిగత విషయాలు అనవసరం. నాకు సంబంధించినంత వరకూ ఈ ఆఫీసులో మనుషులూ,



అంది:

"ఎండ బ్రహ్మాండంగా ఉంది కదూ?"

"ఆఁ" అన్నాను ఆలోచిస్తూ. నేను పుట్టిన దేశంలో ఎండ బ్రహ్మాండంగా ఉందని ఆనందంగా చెప్పుకోం, మాడి చస్తాం అని ఏడుస్తాం.

"మీకు ఎండలు చాలా ఎక్కువ కదూ?"

ఉత్తరాలొచ్చాయి. కావలసిన వేం లేవు. ఓ రెండు కాటలాగులు, mouth wash sample bottle ఒకటీ. భీమా చేసుకోకుండా చస్తే ఏం అవుతుందో తెలియజేసే భీమా కంపెనీ ఉత్తరం ఒకటీ. కానీ ఖర్చు పెట్టకుండా వేలు సంపాదించే అద్భుతమైన ఆలోచన....

"ఎక్కడికి వెళ్ళావు?"— ఎందుకో లేని హుషారు తెచ్చుకుని అడిగినట్టనిపించింది.

కాని నేను పట్టించుకోకుండా ఉండడం మంచిది.

"పీటర్ దగ్గిరికా?"— మళ్ళీ ప్రశ్న.

అవునన్నట్టు తలూపాను, నిప్పుకోడిలా ఫైల్స్‌లోకి తల దూర్చేస్తూ.

"ఇంతసేపా?"

పీటర్‌కి నేనంటే ప్రత్యేకమైన అభిమానం. జూలీయేకాదు వేరే ఒకళ్ళిద్దరు కూడా ఈ విషయంమీద వ్యాఖ్యానించారు. వేరే కారణం ఏం లేదు. గాడిదలా పని చేస్తాను. అతనికి కనీసం ఒకటిన్నర మనుషుల పని గిడుతుంది - నా కిచ్చే ముష్పాతిక జీతానికీ.

ఈ ఫైళ్ళు ఒకటే...." అన్నాను కఠినంగానే, ఓ బొత్తి ఫైళ్ళు పట్టుకుని.

జూలీ మొహం ఒక్క క్షణం తెల్లబడింది.

మరీ కఠినంగా మాట్లాడేనేమో- అదే మాట కొంచెం సౌమ్యంగా చెప్పి వుండొచ్చు నేను.

జూలీ సిగరెట్ తీసి చేత్తో పట్టుకుని నా వేపు చూసింది.

పీటర్‌తో మాట్లాడిన ఫైలంతా చిక్కుగా ఉంది. ఎలా రాయాలో బోధపడడంలేదు. ఫైలు విసుగ్గా బల్లమీదికి విసిరేశాను.

"విసుగ్గా ఉందా?"- జూలీ అడిగింది.

నేను మాట్లాడలేదు. ఓ మారు తన

వేపు చూశాను.

జూలీ చేతిలో ఉన్న సిగరెట్‌వేపు ఒక మారూ- నావేపు ఒక మారూ చూసి మళ్ళీ సిగరెట్ పెట్టెలో పెట్టేసింది.

ఆశ్చర్య పోయాను. ఎక్కుపెట్టిన బాణంలా జూలీఎప్పుడూ పెట్టెలోంచి తీసిన సిగరెట్ కాల్చకుండా వదిలి పెట్టలేదు.

"జూలీ!" మాట్లాడకుండా ఉండలేక పోయాను.

"ఏమైంది?"

జూలీ మాట్లాడలేదు. ఆవిడ ముందు బల్లమీద ఉన్న కాగితంవేపు చూస్తోంది. ఏదో విషయం- చాలా బాధ కలిగించేదయి వుండాలి.

హఠాత్తుగా జూలీ తన కుర్చీలోంచి లేచి వచ్చి నా కెదురుగా కూర్చుంది.

"ఇది చూడు" ఒక పేపరు కత్తిరింపు నాకు అందిచ్చింది.

అదొక మరణవార్త. ఎక్కడో పియోరియా అనే ఊళ్ళో హారియెట్ క్రిస్టెన్‌సన్ అనే ఆవిడ మరణించింది—గుండె జబ్బుతో. వయసు యాభై. వచ్చే ఆదివారం వారి పద్ధతి ప్రకారం అంత్యక్రియలు.

జూలీ తల్లి పేరు బార్బరా అని ఇది వరకు చెప్పింది.

"మీ చుట్టమా?"- అడిగాను.

జూలీ ఒక నిముషం మాట్లాడలేదు.

ఇంకేం మాట్లాడాలో నాకు తోచలేదు.

జూలీయే మెల్లిగా, అతి మెల్లిగా అంది.


"నాకు జన్మనిచ్చిన స్త్రీ".

తుళ్ళిపడ్డాను. "మీ అమ్మా?"

జూలీ అవునన్నట్టు తలూపింది.

కాలం మెల్లిగా, అతి మెల్లిగా, నడుస్తున్నట్టనిపించింది.

"ఆవిడ మా అమ్మ, నాకీ సంగతి తెలుసుకోడానికి పదహారేళ్ళు పట్టింది. నాకు పదకొండేళ్ళు సోరెన్‌సన్స్ నన్ను పెంచుకుంటున్నారని తెలిసినపుడు.... అప్పట్నించీ మా అమ్మని చూడాలని తహ తహ.... కనిపించిన వాళ్ళ నందర్నీ అడిగాను- నర్సులూ, డాక్టర్లూ, రెసిడెంట్ డాక్టర్లూ, స్టూడెంట్ నర్సులూ- ఎంత మందో లెక్కలేదు. ఫెడరల్ రికార్డులు, హాస్పిటల్ రికార్డులు- ఎన్ని ఫైళ్ళు వెతికానో లెక్కలేదు. ప్రత్యేకం దీని కోసం




మూడు స్టేట్స్‌లో మూడు ఆర్గనైజేషన్స్‌లో మెంబర్నయేను....

జూలీ కొంచెం సేపు గుక్క తిప్పుకోడానికన్నట్టు ఆగింది.

"ఆఖరికి నిన్న న్యూజెర్సీనించి ఉత్తరం వచ్చింది- ఆవిడ పియోరియోలో ఉన్నట్టు .... రాత్రంతా ఆలోచించాను- ఆవిడ్ని చూడడం గురించి" జూలీ నా చేతిలోంచి పేపర్ కటింగ్ తీసుకుంది.

"ఐయామ్ సారీ" అన్నాను.నా మాట నాకే అర్థం లేనట్టనిపించింది.

జూలీ వెలితిగా నవ్వింది. "తమాషాగా లేదూ?.... నేనూ, మా అమ్మా ఒకళ్ళ నొకళ్ళం చూసుకోడం మొదట నేను పుట్టినప్పుడు.... అప్పుడు నా చుట్టూ ఏం జరుగుతోందో నాకు తెలీదు.... మళ్ళీ చూడడం ఆవిడ చచ్చిపోయినప్పుడు.... ఇప్పుడు తన చుట్టూ ఏం జరుగుతోందో ఆవిడకి........

నా గుండెలు పట్టేసినట్టయింది.

నేను కుర్చీలోంచి లేచి, తన దగ్గిరికి వెళ్ళి భుజంమీద చెయ్యేసి అన్నాను. "కాఫీ తాగుదాం రా."

ఆ అమ్మాయి కళ్ళెత్తి నా వేపు చూసింది. ఆ కళ్ళు తడిగా ఉన్నాయి.

కాఫిటేరియాకి వెళ్తున్నంత సేపూ, కాఫీ తాగుతున్నంతసేపూ జూలీ మాటాడుతూనే ఉంది— ఎవరితో ఏం మాట్లాడిందో, ఏ ఫైళ్ళు చూడడాని కెంత శ్రమపడిందో, ఏ ఆర్గనైజేషన్స్ ఏం చేస్తాయో....

ప్రతిమాటా జాగ్రత్తగావింటున్నాను. తెరిచిన పుస్తకంలా ఉంది ఆ సమయంలో ఆ పిల్ల.

హఠాత్‌గా జూలీ అడిగింది, "మీ దేశంలో పెళ్ళిళ్ళే నయం. తండ్రి పేరు తెలీని పిల్లలుండరు."

జూలీ 'ఏం అంటోందో నాకు అర్థం అయింది. గుండెల్లో పొడిచినట్టయింది.

మళ్ళీ జూలియే అడిగింది, "నువ్వు మీ పెద్దలు చెప్పిన సంబంధమే చేసుకుంటావా?"

గబుక్కున లేచాను. "ఏమనుకోకు. నేను అర్జెంట్‌గా పంపించవలసిన కాయితాలున్నాయి. వెంటనే వెళ్ళాలి. నేన్నీతో తరవాత మాటాడతాను. ఏం అనుకోవు కదూ."

కాఫీ డబ్బు, టిప్ బల్లమీద పడేసి, గబగబ నా సీటు వేపు నడిచాను కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది.

పెద్దవాళ్ళు చూసుకుంటారు అన్నీ....

అక్కడ పెళ్ళిళ్ళే నయం....

తండ్రి పేరు తెలీని....

భగవంతుడా!

జూలీ పీటర్ రూంలోంచి వచ్చి తన సంచీ తీసుకుంటూ అంది.

"నేను పర్మిషన్ పెట్టి వెళ్ళిపోతున్నాను. రేపు కూడా రాను.

"అంత్యక్రియల సర్వీసులకి వెళ్తాను."

"మీ అమ్మగారి మృతి గురించి నేను చాలా విచారపడుతున్నాను" అన్నాను.

జూలీ గుమ్మందాకా వెళ్ళి వెనక్కి తిరిగి అంది, "థాంక్యూ".

జూలీ వెళ్ళిపోయింది.

నా మనసంతా అల్లకల్లోలంగా ఉంది. తన మాటలు గుడిగంటల్లా గుండెల్లో కొట్టుకుంటున్నాయి. ఫైలు తీస్తే ఒక్క అక్షరం కూడా కనిపించడంలేదు. టైము చూశాను. కనీసం ఇంకో గంట పని చెయ్యాలి. జూలీ పర్మిషన్ పెట్టింది. నేను కూడా అడిగితే బావుండదు.

"పెద్దవాళ్ళు.... అక్కడ పెళ్ళిళ్ళే.... తండ్రి పేరు...."

పిచ్చెత్తి పోతున్నట్లనిపించింది. ఫోన్ తీసి చిన్న మామయ్య నెంబరు డయల్ చేశాను.

"హలో" కామాక్షి పిన్ని ఫోను తీసింది. సాధారణంగా ఆవిడ ఫోను తియ్యదు.

"నేను పిన్నీ, శారదని".

"ఓ. బావున్నావా?"

నేను జవాబు చెప్పలేదు.

"శారదమ్మా!" పిన్ని పిలిచింది అట్నించి.

"ఆఁ. ఏం లేదు- బాగానే ఉన్నాను." తొందరగా అన్నాను.

"మాట్లాడకపోతేను...."

"ఏం లేదు.... నాకేం తోచడం లేదు పిన్నీ! ఇవాళ సాయంత్రం మా ఇంటికో మారు రాకూడదూ?" వీలయినంత మామూలుగా ధ్వనిస్తూ అన్నాను.

"అలాగే," అంది పిన్ని.

ఆ ఒక్కమాటకే మనసు చల్లబడింది.

"ఇంకో గంటలో నా పనయిపోతుంది. ఇక్కడ్నించి తిన్నగా మీ ఇంటికొచ్చి నిన్ను తీసుకెళ్తాను. మళ్ళీ నేనే నిన్ను దింపుతాలే."

"సరే" అంది పిన్ని. పిన్ని ఎప్పుడూ ఇంతే. తూచినట్టు ఎంత మాటాడాలో అంతే మాటాడుతుంది. వెయ్యి ప్రశ్నలతో వేధించుకు తినడం ఆవిడదగ్గిర లేదు.

ఫోను పెట్టెయ్యబోతుంటే అంది, "మా చిన్నమామయ్యకూడా ఓ మారు ఫోను చేసి చెప్పు ఉంటాను."

"అలాగే చేస్తాను." అన్నాను నేను.

అయిదయే సరికి చిన్నమామయ్య ఇంటిముందు వాలేను ఇంట్లో ఇంకెవరూ లేరు. పిన్ని తయారుగానేఉంది ఉల్లిపాయ రంగు వెంకటగిరి చీరె, తెల్లజాకెట్టూ వేసుకుంది.

"వెళ్దామా?" అంది నన్ను చూడగానే ఆప్యాయంగా.

"పద" అన్నాను, నేనుకూడా వెనక్కి తిరుగుతూ.

కారు నడుపుతున్నానన్న మాటేకాని. మనసంతా చికాగ్గా వుంది. ఎంత ప్రయత్నించినా జూలీ మొహం మనసులోంచి చెరుపుకోలేకపోతున్నాను.

మొనానా నది పక్కనుంచి వెళ్తుంటే నీళ్ళమీంచి గాలి వచ్చి చల్లగా మొహానికి తగిలింది.

పిన్నివేపు చూశాను. ఆవిడ కిటికీ లోంచి చూస్తోంది, అటువేపుకి.

"ఇక్కడ కొంచెం సేపు కూచుందామా?" పిన్నివేపు చూడకుండానే అడిగాను.

"కూచుందాం."

కారు ఓ పక్కకిఆపేను ఇద్దరం కారు దిగి నీళ్ళకి దగ్గిరగా గడ్డిలో కూచున్నాం. గాలి మెల్లిగా. వీస్తోంది, నీళ్ళలో అలలు చిన్నగా కదుల్తున్నాయి. బాతులు వయ్యారంగా నీళ్ళమీద తేలుతూ నేర్పుగా చిన్న చిన్న చేపల్ని పట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఒడ్డున ఒకటి, రెండు బాతులు సేదదీరి కూర్చున్నాయి.

"ఇంటినుంచి ఉత్తరాలొస్తున్నాయా?" పిన్ని అడిగింది.

"రెండు రోజుల కిందట ఓటొచ్చింది."

మళ్ళీ ఇద్దరిమధ్య నిశ్శబ్దం వరుచుకుంది.

హఠాత్‌గా నామీద నాకే మహా చిరాకేసింది. అసహ్యం ఉవ్వెత్తుగా లేచి పడింది.

అవతలి గట్టు చూస్తూ అన్నాను. "అన్నయ్యా, వదినా పిల్లని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. పిల్ల ఆ ఇంట్లో మహా గౌరవంగా పెరుగుతోంది. కాని దాన్ని కన్నతల్లిని నేను...."

ఒక నిముషం ఆగి అన్నాను:"ఎవరేం అనుకున్నా సరే నాకక్కర్లేదు ఎవరేం అన్నా నే పట్టించుకోను.

నిజానికి నా తప్పుకి..... నా తప్పు మాత్రం ఎందుకవుతుంది?

నా తప్పుకాదు. నా బిడ్డ ఎందుకు బాధపడాలి? దాన్నిక్కడికి తెచ్చేస్తాను. నా దగ్గిరే పెట్టుకుంటాను...."

ఈ మాటలు అనేశాక మనసు కుదుటపడింది.

ఇప్పుడు ప్రాణం హాయిగా ఉంది.నా బిడ్డ నా దగ్గరున్నంత సంతోషంగానూ ఉంది.

"మంచిదే, తెచ్చెయ్" అంది కామాక్షి పిన్ని.

వెనక్కి తిరిగి ఆవిడ మొహంలోకి చూశాను. ప్రశాంతంగా వుంది.

మొనోనావేపు చూశాను. నిర్మలంగా ఉంది.

హాయిగా గుండెలనిండా గాలి పీల్చుకున్నాను.సోమవారం జూలీతో చెప్పేస్తాను.

